క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: జేమ్స్‌స్ట్రీట్, చిలకలగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ ఆదినారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నవకేతన్ కాంప్లెక్స్, మీసేవా, మారుతీ ఎస్టేట్, రాజదీన్‌దయాళ్, కార్పొరేషన్, కాలేజ్ ఆఫ్ ఎయిర్‌ఫోర్స్, జయచంద్రా ఎన్‌క్లేవ్, పంచశీల పార్కు, ఘరోండా ఎన్‌క్లేవ్, ఇండేన్ గ్యాస్, శ్రీపద్మావతి రెసిడెన్సీ, హిమబిందు రెసిడెన్సీ, ఫుడ్‌మార్ట్.
- మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కృష్ణానగర్ గార్డెన్, ఈఎస్ఐ, కల్పన టింబర్ డిపో, ఎంఐజీహెచ్ బోయిగూడ, రాజీవ్‌గాంధీ విగ్రహం, ఐడీహెచ్ కాలనీ చర్చి, ఉప్పలమ్మ ఏరియా, హర్షిత రెసిడెన్సీ, భోలక్‌పురి, మేకల మండి, మల్లికార్జున టెంపుల్, మంత్రాల బాలయ్య ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

పాత కక్షల నేపథ్యంలో కత్తితో ముగ్గురిపై దాడి

అమీర్‌పేట: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇటీవల హనుమాన్ జయంతి సందర్భంగా బీజేఆర్‌నగర్‌కు చెందిన కొందరు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యువకుల మధ్య గొడవ జరిగింది. దీనికి తోడు కుస్తీపోటీల విషయంలోనూ వారి మధ్య పాత కక్షలు కొనసాగుతున్నాయి. తరుచూ నిర్వహించే పోటీల్లో కొందరికే పతకాలు వస్తున్నాయంటూ మరో వర్గం కక్ష కట్టింది. ఈ క్రమంలో గురువారం కూడా వీరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఓ వర్గంలోని బాలుడు కత్తితో మరో వర్గానికి చెందిన ముగ్గురిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కాగా ఈ ఘటనలో అందరు మైనర్లే ఉండటం గమనార్హం.

రేవంత్‌ను కలిసిన నేతలు



లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్.ఎల్ శ్రీనివాసులుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు రేవంత్‌రెడ్డిని గాంధీ భవన్‌లో కలిశారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై కాసేపు చర్చించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలని, అందుకు అనుగుణంగా బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని ఈ సందర్భంగా రేవంత్ సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండ

లాలాపేట: తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం తార్నాకలో అమరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. తార్నాక చౌరస్తాలో ఏర్పాటు చేసిన అమరుడు మోతె రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.

'విద్యార్థుల ఆందోళన అర్థరహితం'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని నిజాం కాలేజీ ఐదేళ్ల ఎమ్మెస్సీ విద్యార్థులు గత పది రోజులుగా చేస్తున్న ఆందోళన అర్థరహితమని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఇంటిగ్రేటెడ్ కోర్సు రద్దుతో ప్రస్తుతం చదివే విద్యార్థులకు ఎలాంటి నష్టం లేదన్నారు. ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు శాశ్వత కోర్సు కాదని, సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాతిపదికన ప్రవేశపెట్టారని మారిన పరిస్థితులకు అనుకూలంగా మార్కెట్ అవసరాలను బట్టి కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం, తొలగించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకోకుండా ఆందోళనను విరమించుకోవాలన్నారు.

బైక్‌ర్యాలీ సరే.. రక్షణేదీ ?



తెలంగాణ అమరుల స్మారక స్థూపం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తార్నాక నుంచి ట్యాంక్‌బండ్ వరకు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఏ ఒక్కరూ హెల్మెట్లు పెట్టుకోలేదు. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం ఏంటని ప్రజలు చర్చించుకున్నారు.

–సాక్షి, సిటీబ్యూరో

సకల సౌకర్యాల ఒడి.. సర్కారు బడి





విశాలమైన తరగతి గదిలో డిజిటల్ బోధన

- ఆధునిక హంగులతో గుండా ఈశ్వరయ్య స్మారక పాఠశాల
- కార్పొరేట్ తరహా విద్యాబోధన
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ హైదర్‌బస్తీలోని గుండా ఈశ్వరయ్య స్మారక ప్రభుత్వ బాలికోన్నత, ప్రాథమిక పాఠశాలలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. మనబడి–మనబస్తీలో భాగంగా సుమారు రూ.40లక్షల వ్యయంతో సెకండరీ, ప్రాథమిక పాఠశాలను తీర్చిదిద్దారు. కార్పొరేట్ స్థాయిలో సర్కారు బడిని సకల సదుపాయాలతో అభివృద్ధి చేశారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేకంగా సదరు పాఠశాలలను మనబడి–మన బస్తీ కార్యక్రమంలో చేర్చి పాఠశాల సమగ్రాభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

450 విద్యార్థులు..

పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడానికి వీలుగా ఈ పాఠశాలను రూపొందించారు. విద్యాబోధనలో పిల్లలకు ఎక్కడ కూడా అసౌకర్యం లేకుండా ఆధునిక పద్ధతిలో అందంగా రూపకల్పన చేశారు. మోడ్రన్ పద్ధతిలో విద్యాబోధన.. ఆహ్లాదకరమైన వాతావరణంతో పిల్లలు చక్కగా చదువుకునేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో కలిపి ఇక్కడ సుమారు 450 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఈ పాఠశాలను తీర్చిదిద్ది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు.

- తరగతి గదులను అందంగా తీర్చిదిద్దటంతో పాటు పిల్లలు పుస్తకాలు ఇతరత్రా సామగ్రి పెట్టుకోవడానికి వీలుగా టేబుళ్లు, చక్కని ఫర్నీచర్. ఆధునిక పద్ధతిలో స్క్రీన్ మీద ఇంటర్‌నెట్ సహాయంతో విద్యాబోధన సదుపాయం. తరగతి గదుల్లో చక్కని వెలుతురు కోసం విద్యుత్తు దీపాలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.పాఠశాల పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. టాయిలెట్స్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను కల్పించారు. ఇంగ్లిష్ మీడియంలో 1వ తరగతి నుంచి 10 వరకు విద్యాబోధన. నిష్ణాతులైన అధ్యాపక బృందం చేత విలువలతో కూడిన విద్యాబోధన. మధ్యాహ్న భోజనం వారంలో మూడు రోజులు రాగి జావాను అందిస్తారు.

విలువలతో కూడిన విద్యాబోధన..



గుండా ఈశ్వరయ్య స్మారక ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ తరహా విద్యను అందిస్తున్నాం. ఆధునిక పద్ధతిలో విద్యార్థులు ఇట్టే పాఠాలను అర్థ చేసుకునే విధంగా బోధిస్తున్నాం. అదే విధంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలో అనేక రకాల సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తున్నాం. మన బడి–మన బస్తీ ద్వారా పాఠశాలను సకల సదుపాయాలతో తీర్చిదిద్దడం జరిగింది.

– ఉమాదేవి, ప్రధానోపాధ్యాయురాలు

విలీనంపై కేంద్ర నిర్ణయం వెల్లడించాలి

పీఎంఓకు వికాస్‌మంచ్ లేఖ



సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసిన వికాస్ మంచ్ సభ్యులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని సివిల్ ప్రాంతాలను వేరుచేసి, సమీప మున్సిపాలిటీ (జీహెచ్ఎంసీ)లో విలీనంపై కేంద్రం నిర్ణయం వెలువడించాలంటూ కంటోన్మెంట్ వికాస్ మంచ్ (సీవీఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు వికాస్ మంచ్ తరఫున ప్రధాన మంత్రి కార్యాలయానికి లేఖ రాసినట్లు సీవీఎం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం ఏబెల్, సంకి రవీందర్ తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీనానికి సంబంధించి జనవరిలోనే కమిటీ ఏర్పాటు చేయగా, ఫిబ్రవరి మొదటి వారంలో కమిటీ నివేదికను కేంద్రానికి సమర్పించిందన్నారు. అయితే నాలుగు నెలలుగా కేంద్రం తన వైఖరిని వెల్లడించకపోవడంతోనే తాము పీఎంఓకు లేఖ రాశామన్నారు. తమ లేఖకు పీఎంఓ అధికారులు, ఫోన్ ద్వారా స్పందించినట్లు వెల్లడించారు. కంటోన్మెంట్ల విలీనంపై త్వరలోనే విధాన నిర్ణయం వెలువడుతుందని సమాధానం చెప్పినట్లు పేర్కొన్నారు. ఇదే విషయమై కమిటీ సభ్య కార్యదర్శి అయిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌ను సైతం కలిసి ఆరా తీయగా విలీనం పట్ల కేంద్రం సానుకూలంగా ఉందని ఆయన వెల్లడించారన్నారు.

'కిమ్స్' నుంచి మరొకరి డిశ్చార్జి



సనత్‌నగర్: ఎల్బీనగర్ సమీపంలోని సాగర్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో ఉన్న బైరామల్‌గూడ ఫ్లై ఓవర్ ర్యాంప్ కూలిన ఘటనలో గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో గురువారం మరొకరు డిశ్చార్జి అయ్యారు. ఈ ఘటనలో తొమ్మిది మంది గాయపడగా బుధవారం కమల్ కుమార్, రవికుమార్ డిశ్చార్జి కాగా గురువారం మురళీకృష్ణ డిశ్చార్జి అయ్యాడు. తీవ్ర గాయాలకు గురై విషమంగా ఉన్న రోహిత్‌కు వైద్యులు రెండో సర్జరీ చేశారు. మిగిలిన పునీత్, శంకర్‌లాల్, జితేందర్, రత్నేష్‌కుమార్, హరేరామ్ కుమార్‌కు కూడా చికిత్స కొనసాగుతుండగా వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

బీజేపీ నేతల పరామర్శ..

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం బీజేపీ నేతలు మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, సామ రంగారెడ్డి, పెద్ది రవీందర్, శ్రీనివాస్ కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడ్డ వారికి రూ. 15 లక్షలు, స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా రామచందర్‌రావు డిమాండ్ చేశారు.

ఓయూలో ఏడు మెట్లబావులు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ భూ విస్తీర్ణంలో ఏడు మెట్లబావులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. క్యాంపస్‌లోని బీఈడీ కాలేజీలోని పురాతన మెట్లబావిని కాలేజీతో పాటు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరమ్మతులు చేపట్టి సుందరీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. నీటి అవసరాల కోసం మెట్ల బావులను పునరుద్ధరించుకోవాలన్నారు. వచ్చే ఏడాది మరో రెండు మెట్ల బావులకు మరమ్మతు చేయించనున్నట్లు తెలిపారు. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, కల్పన రమేష్, ప్రొ.గోపాల్‌నాయక్ పాల్గొని ప్రసంగించారు.

విష్ణుకు వీసీ పరామర్శ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని వివిధ హాస్టల్స్ భవనాల చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని వీసీ ప్రొ.రవీందర్ ఆదేశాలు జారీ చేశారు. పాముకాటుతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పీహెచ్‌డీ విద్యార్థి విష్ణును గురువారం వీసీతో పాటు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌రావు పరామర్శించారు. విష్ణు ఆరోగ్యం నిలకడగా ఉండడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. హాస్టల్ పరిసరాల్లో చీకటిగా ఉండే ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.



విష్ణును పరామర్శిస్తున్న ఓయూ అధికారులు

పేదలకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూమ్‌లను కేటాయించాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఐద్వా, కేవీపీఎస్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూమ్‌లు ఇస్తామని హామీ ఇచ్చిందని పదేళ్లు కావస్తున్నా ఇళ్లు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హడావుడిగా సంగారెడ్డి కొల్లూరులో డబుల్ బెడ్రూమ్ ప్రారంభిస్తున్నారన్నారు. జీవో 58 ప్రకారం దరఖాస్తుదారులందరికీ ఇళ్ల క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో నాయకులు అజయ్ బాబు, ఆర్. మల్లేష్, గోపాల్, అంజమ్మ, ఎస్‌కే. బాబర్, సత్యనారాయణ, బాలమణి, విజయ్, రేణుక పాల్గొన్నారు.

రాత పుస్తకాల పంపిణీ

రసూల్‌పురా: క్రమశిక్షణతో చదువుకుని ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీగణేష్ కోరారు. కంటోన్మెంట్ నియోజకవర్గం బాలంరాయి ఈద్గా అంబేడ్కర్‌నగర్‌లో గురువారం ఆయన ఫౌండేషన్ తరఫున విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ తరఫున గత 14 ఏళ్లుగా విద్యా, వైద్యం ఉద్యోగం తదితర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకు 35 వేల రాత పుస్తకాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, విక్కి, సాయి, బిక్షపతి, విష్ణు పాల్గొన్నారు.

'గిఫ్ట్ ఏ స్మైల్' ఆధ్వర్యంలో..

కంటోన్మెంట్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ రాత పుస్తకాలు అందే వరకూ 'గిఫ్ట్ ఏ స్మైల్' కొనసాగుతుందని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లోని 1,741 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ.. త్వరలో మరో నాలుగు వేల మంది విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సాయి, ఉమేష్, రామారావు, సాయి కిరణ్, చోటు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఘనంగా అమ్మవారి కల్యాణం


అమీర్‌పేట: అందరి సహకారంతో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.లావణ్య తెలిపారు. వేడుకల విషయంలో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. సమన్వయంతో పని చేసిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు దేవాలయం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు, భక్తుల అవసరాలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టారన్నారు.

పైపులైన్ పనులను అడ్డుకున్న స్థానికులు



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట కమాన్ వీధిలో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను గురువారం స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పనులు జరుగుతున్న ప్రాంతంలో అధికారులు, కాంట్రాక్టర్ లేకపోవడంతో ఇష్టానుసారంగా చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతంలో 6 ఇంచుల పైపులైన్ ఉంటే నూతనంగా 4 ఇంచుల పైపులైన్ వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీధి మొత్తం కాకుండా సగం వరకు పైపులైన్ వేస్తుండటంతో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అధికారులు వచ్చేదాక పనులు చేయవద్దని సిబ్బందికి సూచించారు. కిరణ్‌గౌడ్,జానీ, శ్రీనివాస్, మోహన్‌లాల్, లింగం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హోంగార్డు పదవీ విరమణ



లాలాపేట: హోంగార్డు ఎస్.కె. ఖాజావలి సేవలు అభినందనీయమని ఓయూ పీఎస్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ అన్నారు. గత 32 ఏళ్లుగా నగరంలోని వివిధ ఠాణాలతో పాటు ఓయూ పీఎస్‌లో హోంగార్డుగా సేవలందించారు. గురువారం పదవీ విరమణ పొందిన ఖాజావలిని ఇన్‌స్పెక్టర్‌తో పాటు తోటి సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు.

తెలంగాణలో కుటుంబ పాలన: కాంగ్రెస్



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

బన్సీలాల్‌పేట్: ఎంతో మంది అమరవీరుల ఆత్మ బలిదానాలు.. ఉద్యమకారుల త్యాగాలతో సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దశాబ్ది దగా పేరిట గురువారం సికింద్రాబాద్ సిటీలైట్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు నాగేందర్ రాజ్, సుజాతాగుప్తా, చిరంజీవి మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చుచేస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అరచేతిలో స్వర్గం చూపుతూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు త్యాగాల, పోరాటాల వల్ల సిద్ధించిన రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తాను మాత్రమే తెలంగాణ సాధించినట్లు ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు.

ప్రజల ధనం దుర్వినియోగం

చిలకలగూడ: తెలంగాణ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట కోట్లాది రూపాయల ప్రజల ధనం దుర్వినియోగం చేస్తోందని సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు నోముల ప్రకాశరావు ఇచ్చిన దశాబ్ది దగా పిలుపు మేరకు గురువారం సీతాఫల్‌మండి చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేసీఆర్ డౌన్ ,డౌన్ అంటు నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న చిలకలగూడ పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ చిలకలగూడ ఠాణాకు వచ్చి పార్టీ శ్రేణులను పరామర్శించి, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీశ్వరరావు, సురేష్‌లాల్, కిషోర్‌యాదవ్, ఎమ్మార్ శ్రీనివాస్, అభిషేక్, అరుణ్‌కుమార్, వేణుగౌడ్, పాల్గొన్నారు.

మా వేతనాలు చెల్లించండి సారూ



సీఈవోను కలిసేందుకు వచ్చిన అంగన్‌వాడీ టీచర్లు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల విభాగంలో బూత్ లెవల్ ఆఫీసర్లుగా పనిచేసిన తమకు కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల విభాగం అధికారులు వేతనాలు చెల్లించడం లేదని సికింద్రాబాద్ తిరుమలగిరి మండలాల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తమకు వేతనాలు ఇవ్వాలని బోర్డు సీఈవో మధుకర్‌నాయక్, ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాస్‌ను బీఎల్ఓస్‌గా విధులు నిర్వహించిన 25 మంది టీచర్లు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా తమను కంటోన్మెంట్ బోర్డు అధికారులు బూత్ లెవల్ ఆఫీసర్లుగా ఎన్నికల విభాగం తరఫున పని చేయించుకున్నారని ప్రతి నెల రూ. 7 వేల వేతనం అందజేస్తామని హామీ ఇచ్చారని ఇప్పటికి ఎలాంటి వేతనం ఇవ్వలేదన్నారు. తాము వేతనాల కోసం అడగగా జీహెచ్ఎంసీ అధికారులను కలవాలని సూచిస్తున్నా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తమ వేతనాలు ఇప్పించాలని కోరుతున్నారు.

మోదీ తొమ్మిదేళ్ల పాలన సువర్ణాధ్యాయం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న శ్యాంసుందర్‌గౌడ్

సనత్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలన ఒక సువర్ణాధ్యాయమని బీజేపీ మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం సనత్‌నగర్ డివిజన్ 209 బూత్‌లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను వివరించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రపంచదేశాలు భారత్ వైపు నేడు చూస్తున్నాయంటే ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయాలు, సంస్కరణలే కారణమన్నారు. నిరుపేదల సంక్షేమమే ఎజెండాగా సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి కేంద్రంలో అధికారం చేపట్టడంతో పాటు రాష్ట్రంలో సైతం బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నరేష్‌ముదిరాజ్, క్రాంతికుమార్, దయానంద్, రవీందర్, నర్సింగరావు, కర్రె భాస్కర్, శ్రీశైలంగౌడ్, మహేష్ పాల్గొన్నారు.

తార్నాకలో..

లాలాపేట: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం తార్నాకలోని బూత్ నెంబర్–200లో ఆ పార్టీ నాయకురాలు బండా కార్తీకరెడ్డి పాల్గొని కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నరేంద్రమోదీ పాలన అభివృద్ధి బాటలు వేసిందన్నారు. బండా చంద్రారెడ్డి, నళినీకాంత్, లడ్డు, కరుణాకర్, భూపాల్‌రెడ్డి, శ్రీలక్ష్మీ, శ్రీను, రామువర్మ, వీరన్న పాల్గొన్నారు.

ఆరోవార్డు పరిధిలో..

కంటోన్మెంట్: ప్రధాని మోదీ విజయాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లడమే 'ఇంటింటికీ బీజేపీ' లక్ష్యమని ఆ పార్టీ కార్యవర్గ సభ్యులు భానుక మల్లికార్జున్ అన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు భానుక నర్మదతో కలిసి గురువారం ఆయన ఆరోవార్డు పరిధిలోని బూత్ నెంబర్132, 133, 134లో పర్యటిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, అజయ్ గౌడ్, ప్రతీక్ జైన్, సాయి ప్రకాశ్, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మధురానగర్‌లో..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లోని మధురానగర్‌లో మేకల కీర్తి ఆధ్వర్యంలో గురువారం మేకల సారంగపాణి, ఆనంద్, ఖయ్యూం పాషా, గణేష్, మహేష్, ప్రభాకర్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

బ్రాహ్మణ బస్తీలో..

కేంద్ర ప్రభుతం ప్రజా సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు. ఈ మేరకు వారాసిగూడలోని బ్రాహ్మణబస్తీలో గురువారం ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవిప్రసాద్ గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, భాస్కర్ గిరి, అజయ్ కుమార్, సురేందర్, వేణుగోపాల్, ప్రసాద్, చైతన్య పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న ఐదుగురి రిమాండ్

అడ్డగుట్ట: అక్రమంగా పశువులను తరలిస్తున్న పలువురిని రిమాండ్‌కు తరలించిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధులత వివరాల ప్రకారం.. మల్కాజ్‌గిరిలోని బీజేఆర్ నగర్ ప్రాంతానికి చెందిన అఫ్జల్(28), వహీద్(65), షేక్ గులాబ్(35), షాదుల్లా హుస్సేన్(38), అబ్దుల్ లతీఫ్(36) ఈ నెల 20న ఘట్‌కేసర్‌లోని కొండమడుగు నుంచి అక్రమంగా ఏడు ఎడ్లను డీసీఎంలో తరలిస్తున్నారు. మిర్జాల్‌గూడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఎద్దుల తరలింపునకు సంబంధించి డీసీఎంలో ఉన్న వారిని ఆరా తీయగా వధించడానికి తీసుకెళ్తున్నట్లు చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా.. స్థానిక ఎంఐఎం నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్సీ మిర్జార్ అహ్మద్ లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఐదుగురిని విడుదల చేయాలని పోలీసులను కోరారు. ఎడ్లను వధించేందుకు అనుమతి లేదనడంతో ఎమ్మెల్సీ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్సీతో వచ్చిన లాలాగూడ, మల్కాజ్‌గిరి ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వారిని బయటకు తీసుకువెళ్లేందుకు యత్నిస్తుండగా కొద్దిసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. పోలీసు విధులకు ఆటంకం కలిగించారని ఫయీమ్, ఫారుకీ, మహ్మద్ అఖిల్, సోహెల్, రజాక్, సమీర్, ఒమర్‌లపై కూడా కేసు నమోదు చేశారు. ఎడ్ల తరలింపునకు పాల్పడిన ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యోగాతో ఆరోగ్యం.. సంగీతంతో ఆహ్లాదం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిల హైస్కూల్లో గురువారం అంతర్జాతీయ యోగా, సంగీత దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇంటర్నేషనల్ మోటివేషన్ స్పీకర్ డా.శ్రీమంత్ కుమార్ సాహూ ప్రసంగించారు. యోగా అంటే కేవలం ఆసనాలు, వ్యాయామం మాత్రమే కాదని, మానవుని మేధాశక్తి, ఆత్మల కలయిక అన్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యాన్ని అందించి దృఢంగా మార్చడంలో యోగా చాలా ఉపయోగపడుతుందని ద్వారిక ప్రసాద్ వివరించారు. అనంతరం విద్యార్థులచే ఓంకారం, ఆటా పాటలతో యోగాసనాలు వేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ గానామృతంతో అందరిని అలరించారు.

వర్షానికి కూలిన రేయిలింగ్



లాలాపేట: నగరంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి శాంతినగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఎదురుగా ఉన్న పాత కాలంనాటి భవనం మొదటి రేయిలింగ్ కూలి కిందపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందం ఘటనా స్థలానికి చేరుకుని శిథిలాలను తొలగించారు.